సాక్షి చిత్తూరు

శుక్రవారం । 28 । జూన్ । 2024



ఖర్చుల వివరాలు అందజేయండి

సార్వత్రిక ఎన్నికల ఖర్చుల వివరాలను బరిలో నిలిచిన అభ్యర్థులు అందజేయాలని జిల్లా ఆడిట్ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. - 8లో



ముగ్గురికి గాయాలు

కారు, ఐచర్ వాహనాలు ఢీకొనడంతో ముగ్గురు గాయపడిన సంఘటన గుడిపాలలో వెలుగుచూసింది. - 8లో



సేవాభావానికి ప్రతిరూపం

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరి సమాజ సేవ చేయాలని జిల్లా కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబు పిలుపునిచ్చారు. - 8లో

న్యూస్‌రీల్

పీఎఫ్ సమస్యలు పరిష్కరించండి



సీఈఓ గ్లోరియాకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) సమస్యలను పరిష్కరించాలని జిల్లా పరిషత్ సీఈఓ గ్లోరియాకు గురువారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు నాగరాజు వినతిచేశారు. పీఎఫ్ షెడ్యూల్‌లను ఆన్‌లైన్‌లో విడుదల చేయాలన్నారు. అదేవిధంగా పీఎఫ్ లోన్ దరఖాస్తు చేసుకున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇదివరకు రావాల్సిన బకాయిలను త్వరగా విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం, గౌరవ అధ్యక్షుడు ఉమాపతి, సీనియర్ నాయకులు బలరామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ కమిషనర్ చౌడేశ్వరి బదిలీ



చౌడేశ్వరిని సత్కరిస్తున్న డీఈఓ, కార్యాలయ సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న చౌడేశ్వరి బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఏడాదికి పైగా జిల్లాలో విధులు నిర్వహించిన ఆమె గత విద్యాసంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం ఆమె కర్నూలు జిల్లా డీఈఓ కార్యాలయం పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆమె గురువారం డీఈఓ దేవరాజు సమక్షంలో విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఆమె స్థానంలో డీఈఓ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావుకు అదనపు బాధ్యతలను అప్పగించారు. విధుల నుంచి రిలీవ్ అయిన చౌడేశ్వరిని డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్లు, సిబ్బంది దుశ్శాలువతో సత్కరించి వీడ్కోలు పలికారు.

రిజిస్ట్రేషన్లకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : అడవులు, జీవవైవిధ్యం, వన్యప్రాణులపై అవగాహన కల్పించేందుకు వైల్డ్ విజ్డమ్ గ్లోబల్ చాలెంజ్ నిర్వహిస్తున్న కార్యక్రమానికి విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులు గురువారం డీఈఓ కార్యాలయానికి అందాయి. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. ప్రకృతి పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు జూలై 31వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు www.academy.wwfindia. orf/widwirdom వెబ్‌సైట్‌లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నెల వ్యవధిలో 169 డయేరియా కేసులు

- డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య సూత్రాలను విధిగా పాటించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆమె అధికారులతో సమీక్షించారు. నెల వ్యవధిలో జిల్లావ్యాప్తంగా 169 డయేరియా కేసులు నమోదయ్యాయని, ఇందులో పలమనేరు మండలంలో 67 కేసులు, పాలసముద్రంలో 53, గుడుపల్లెలో 14, సోమలలో 10 కేసులు ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాల్లో తక్షణమే అధికారులు స్పందించి వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగులను పరీక్షించి వైద్యసేవలు అందించడంతో కోలుకున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకంగా నేర్పించి..



దివ్యాంగులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు జిల్లా సమగ్రశిక్ష అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు విద్య అందించేందుకు భవిత కేంద్రాలను సిద్ధం చేశారు. ఇటీవల సర్వే చేయడంతో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు మరి కొంతమంది వెలుగులోకి వచ్చారు. వీరికి ప్రభుత్వపరంగా సంక్షేమ పథకాలు అందేలా జిల్లా అధికారులు సమగ్ర నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించారు. దీంతో దివ్యాంగుల చిన్నారుల జీవితాల్లో వెలుగులు రానున్నాయి.



జిల్లాలో పరిస్థితి ఇదీ..

- భవిత కేంద్రాలు 31
- పనిచేస్తున్న ఐఈఆర్‌టీలు 62
- ప్రత్యేక అవసరాల పిల్లలు 3,178
- భవిత కేంద్రాల్లో చదివేవారు 672
- హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ పిల్లలు 310

- దివ్యాంగుల చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సమగ్రశిక్ష యంత్రాంగం
- జిల్లావ్యాప్తంగా కొత్తగా 481 మంది ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు
- వారిని భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు చర్యలు
- పర్యవేక్షిస్తున్న ఆ శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని భవిత కేంద్రాల్లో చదువుతున్న దివ్యాంగుల భవితకు భరోసా ఇచ్చేందుకు సమగ్రశిక్ష యంత్రాంగం సిద్ధమైంది. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు ఎంతమంది ఉన్నారనే వాస్తవ లెక్క తెలియడానికి ఇటీవల జిల్లాలో సచివాలయాన్ని యూనిట్‌గా చేసుకుని సమగ్ర సర్వే నిర్వహించారు. చిత్తూరు జిల్లాలో ఇప్పటివరకు నమోదైన 3,178 మందితో పాటు కొత్తగా గుర్తించిన 481 మంది ప్రత్యేక అవసరాల పిల్లలందరికీ పాఠశాలల్లో ప్రవేశం కల్పించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు సమగ్రశిక్ష శాఖ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థుల ఆధార్‌కార్డుకు అనుసంధానం చేస్తూ, ఆయా పాఠశాలల యూ–డైస్ కోడ్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేశారు. దీంతో ప్రత్యేక అవసరాల పిల్లల వాస్తవ గణాంకాల్లో పారదర్శకతతో పాటు వారు ఎక్కడ చదువుతున్నారనేది తెలుసుకునే అవకాశం ఉంటుందని అధికారులు వెల్లడిస్తున్నారు.

కేంద్రాల్లోనే ఫిజియోథెరపీ..

జిల్లాలో 31 భవిత కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలకు ఇద్దరు ఫిజియోథెరపిస్ట్‌లు ఉండగా, ప్రస్తుతం మరో నలుగురిని తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఉన్నతాధికారుల అనుమతితో త్వరలో ఎంపిక ప్రక్రియ నిర్వహించి 4 పోస్టులను భర్తీ చేయనున్నారు. అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారు. శారీరక, మానసిక వైకల్యంతో ఉన్న చిన్నారులు కావడంతో వీరికి ఆటపాటలతో చదువు చెప్పాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలోనే అవసరమైన ఆట పరికరాలు, వస్తువులను కేంద్రాలకు సమకూరుస్తున్నారు. ప్రతి భవిత కేంద్రంలో ఇద్దరు ఐఈఆర్‌టీలు కేంద్రానికి వచ్చే చిన్నారులకు విద్యను అందిస్తారు. వీరితో పాటు ప్రతి కేంద్రంలో ఒకరిని ఆయాగా నియమించారు. శారీరక వైకల్యం అధికంగా ఉన్న చిన్నారులకు ఇంటి వద్దనే వైద్యసేవలు అందించేలా ఫిజియోథెరపిస్టులను ఏర్పాటు చేశారు. ప్రతి శనివారం ఫిజియోథెరపిస్ట్ విద్యార్థుల ఇళ్లను సందర్శించేలా కార్యాచరణ సిద్ధం చేశారు.



భవితా కేంద్రంలో పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న ఫిజియోథెరపిస్ట్

పకడ్బందీగా పర్యవేక్షణ



జిల్లాలోని భవితా కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. భవితా కేంద్రాల్లో, పాఠశాలల్లో చదివే దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వాలు అందజేసే ప్రతి పథకం అందేలా చర్యలు చేపడుతున్నాం. కేంద్రాల పనితీరును మెరుగు పర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు చేపట్టిన తాజా సర్వేలో 481 మందిని గుర్తించాం. గుర్తించిన వారందరిని భవిత కేంద్రాల్లో చేర్పిస్తున్నాం. – ప్రభాకర్‌వర్మ, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్, చిత్తూరు

సర్వే చేపట్టాం..



జిల్లావ్యాప్తంగా సర్వే పకడ్బందీగా చేపట్టడం జరిగింది. ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించడం జరుగుతోంది. సర్వేలో గుర్తించిన 481 మంది విద్యార్థులను బడుల్లో చేర్పించే ప్రక్రియను ప్రస్తుతం నిర్వహిస్తున్నాం. అలాగే ఖాళీగా ఉన్న 4 ఫిజియోథెరపిస్ట్‌ల నియామకానికి కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు చేపడుతాం. ఈ నాలుగు పోస్టులకు నోటిఫికేషన్ జారీచేసి దరఖాస్తులు ఆహ్వానిస్తాం. దరఖాస్తు చేసుకునే వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుంది. – పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి, సమగ్రశిక్ష శాఖ, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్, చిత్తూరు జిల్లా

3వ విడత జాబితా విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అమల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశాల 3వ ఎంపిక జాబితాను రాష్ట్ర అధికారులు విడుదల చేశారు. ఆ జాబితా ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఎంపికైన విద్యార్థులు చేరేందుకు ప్రత్యేక షెడ్యూల్‌ను పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు కేటాయించిన పాఠశాలల్లో ఈ నెల 28వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలన, ఏవైనా సమస్యలు ఉన్నట్‌లైతే ఈ నెల 29న సంబంధిత ఎంఈఓలకు ఫిర్యాదులు అందజేయాలన్నారు. అందిన ఫిర్యాదులను సంబంధిత ఎంఈఓలు ఈ నెల 30వ తేదీన డీఈఓకు, డీఈఓలు జూలై 1వ తేదీన రాష్ట్ర సమగ్రశిక్ష శాఖ ఎస్‌పీడీకి అందజేయాల్సి ఉంటుందన్నారు. అన్నిజిల్లాల నుంచి అందిన ఫిర్యాదులను రాష్ట్ర కార్యాలయంలో జూలై 2న పరిశీలిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ప్రక్రియను డీఈఓ, సమగ్రశిక్ష ఏపీసీలు అత్యంత ప్రాధాన్యతగా భావించి పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

8,599 మందికి బీసీజీ వ్యాక్సిన్

కాణిపాకం: జిల్లావ్యాప్తంగా బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారులు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మొత్తం 560 కేంద్రాల్లో అర్హులైన 8,599 మందికి వ్యాక్సినేషన్ వేశారు. అందులో భాగంగా గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వే ద్వారా గుర్తించిన వారికి వైద్య సిబ్బంది బీసీజీ టీకాపై అవగాహన కల్పించి వ్యాక్సిన్ వేసుకునేలా చూశారు. కాగా ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 1,15,599 మంది బీసీజీ టీకా వేసుకున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ తెలిపారు.

పీఎంశ్రీ స్కూళ్లలో ఒకేషనల్ విద్య

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా అమలవుతున్న పీఎంశ్రీ పాఠశాలల్లో ఒకేషనల్ విద్యను అమలు చేయనున్నట్లు రాష్ట్ర సమగ్రశిక్ష ఎస్‌పీడీ శ్రీనివాసులురెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు 2024–25 విద్యాసంవత్సరంలో అమలు చేసే ఒకేషనల్ విద్య పాఠశాలలను పర్యవేక్షించే బాధ్యతను సమగ్రశిక్ష జీసీడీఓకు అప్పగించారు. ఒకేషనల్ విద్య అమలు చేసే పాఠశాలల్లో పాటించాల్సిన నియమ, నిబంధనలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అత్యంత ప్రాధాన్యతగా డీఈఓ, సమగ్రశిక్ష ఏపీసీలు ఈ ప్రక్రియను అమలు చేయాలని అందులో ఆదేశించారు.

గురుదక్షిణామూర్తికి విశేష అభిషేకాలు



దక్షిణామూర్తికి హారతులు ఇస్తున్న గురుకుల్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆలయంలోని గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేకమైన అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో దీక్షాగురుకుల్, వేద పండితులు, అర్చకులు గురుదక్షిణామూర్తి ఆలయం ఎదుట కలశస్థాపన చేశారు. అనంతరం పాలు, పెరుగు, పంచామృతం, చందనం, విబూది, పసుపు, తేనె, నారికేళ్ల జలంతో అభిషేకాలు చేశారు. తరువాత సుగంధ పరిమళ పుష్పాలతో, స్వర్ణాభరణాలతో భక్తులు సమర్పించిన గుగ్గిళ్లు, మాలలు శోభాయమానంగా అలంకరించారు. వేదమంత్రాల మధ్య స్వామి వారికి పంచ హారతులైన పర్వత , చక్ర, కుంభ, మహా హారతులిచ్చారు. ఏఈఓ సతీష్‌మాలిక్,, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, సుదర్శనం, సూపరింటెండెంట్ నాగభూషణం పాల్గొన్నారు.

ఏ మాత్రం చూడరు!



చిత్తూరు జిల్లాలో మెడికల్ షాపుల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మందులను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఫార్మసిస్టులతో పని లేకుండా షాపులను నడిపేస్తున్నారు. విచ్చ లవిడిగా యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్స్‌ను రోగులకు అంటగడుతున్నారు. సంబంధిత అధికారులు దుకాణ యజమానులిచ్చే మామూళ్లతో తనిఖీలకు స్వస్తి చెప్పేస్తున్నారు. చర్యలకు సైతం ముఖం చాటేస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

- జిల్లాలో ఇష్టారాజ్యంగా మందులు, మాత్రల విక్రయం
- నిబంధనలకు తూట్లు పొడుస్తున్న మెడికల్ షాపుల నిర్వాహకులు
- ఫార్మసిస్టులు, ప్రిస్క్రిప్షన్ లేకుండానే విక్రయాలు
- నిద్రమత్తులో జోగుతున్న సంబంధిత అధికారులు

చిత్తూరు రూరల్(కాణిపాకం) : జిల్లా వ్యాప్తంగా మొత్తం రెండు వేలకుపైగా మెడికల్ షాపులున్నాయి. ఇవిగాక గ్రామాల్లో దాదాపు 800కు పైగా మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు. ఎక్కడైనా ఆస్పత్రి కొత్తగా ఏర్పాటు చేస్తున్నారంటే దానికి అనుసంధానంగా మందుల దుకాణం పెట్టడానికి పోటీపడిపోతున్నారు. జిల్లాలోని కొన్ని మల్టీస్పెషాలిటీ ఆస్పత్రుల్లో మందుల దుకాణం ఏర్పాటుకు పోటీదారులు లక్షల రూపాయలు గుడ్ విల్ ఇచ్చేందుకు వెనుకాడడం లేదంటే అతిశయోక్తి కాదేమో. మందుల దుకాణాల నిర్వహణపై ఔషధ నియంత్రణశాఖ సహాయక సంచాలకుడి పర్యవేక్షణతో పాటు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ ఉండాల్సి ఉన్నా.. వీరు నామమాత్రపు తనిఖీలు నిర్వహస్తూ చేతులు దులుపుకుంటున్నారు. మందుల దుకాణాలకు లైసెన్సులున్నాయా? సంబంధిత సర్టిఫికెట్ ఉన్న ఫార్మసిస్టే దుకాణం నిర్వహిస్తున్నారా? మందులిచ్చే వారికి అనుభవం ఉందా? లేదా? తదితర విషయాలపై పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నా అటువైపు కన్నెత్తి చూడడం లేదు. అర్హత, అనుభవం లేని వ్యక్తులు నిర్వహించే మందుల దుకాణాల వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది.

నిబంధనలు తూచ్

మందుల దుకాణాల్లో ఫార్మసిస్టులు మాత్రమే మందులివ్వాల్సి ఉంటుంది. దుకాణం నిర్వహిస్తున్న సమయాల్లో ఆయన పర్యవేక్షణలోనే మందుల విక్రయాలు జరగాలి. కానీ చాలావరకు రిటైల్ దుకాణాల్లో ఫార్మసిస్టు ఉండడం లేదు. ఇతరుల సర్టిఫికెట్లను అద్దెకు తెచ్చుకుని దుకాణాలను నడుపుతున్న వారు వేలల్లోనే ఉన్నట్టు సమాచారం. ఎంబీబీఎస్ వైద్యులు సిఫార్సు చేసిన మందుల చీటీ ఆధారంగానే జలుబు, జ్వరం వంటి చిన్నచిన్న రోగాలకు సైతం మందులివ్వాలి ఉంటుంది. అయితే ప్రిస్క్రిప్షన్ లేకుండానే చిన్న పిల్లలు వెళ్లి అడిగినా మందు బిళ్లలిచ్చేస్తున్నారు. ఇక దుకాణాల్లో అమ్మే మందులకు ఎలాంటి బిల్లులు ఇవ్వడం లేదు. తెచ్చే మందులకు, విక్రయించే మందులకు ఎలాంటి రిజిస్టర్లు అమలు కావడం లేదు. ఎవరైనా రీయింబర్స్‌మెంట్ కోసం కొనుగోలు చేసేందుకు బిల్లులు అడిగితే ఎమ్మార్పీ, దానిపై జీఎస్టీ వేసి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఏ దుకాణానికీ జీఎస్టీ కూడా లేకపోవడం విశేషం.

చర్యలు తప్పవు

మందుల దుకాణదారులు కచ్చితంగా నిబంధనలను పాటించాలి. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవు. రెగ్యులర్‌గా మందుల షాపులను తనిఖీలు చేస్తున్నాం. మందుల షాపుల్లో కచ్చితంగా ఫార్మాసిస్టులు ఉండి తీరాల్సిందే. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించినట్లు తెలిస్తే తీవ్ర చర్యలు ఎదుర్కోకతప్పదు. అలాంటి మందుల దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తాం. వైద్యుల సిఫార్సు లేకుండా యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ విక్రయించడం నేరం. అలా ఎవరైనా విక్రయించినట్లు సమాచారం ఇస్తే ఆ దుకాణాలను సీజ్ చేసి భారీ జరిమానా విధిస్తాం. – హరిప్రసాద్, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ, తిరుపతి

క్లుప్తంగా

స్టడీ సెంటర్ల అనుమతులకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ :ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ల నిర్వహణకు అనుమతులు పొందే అవకాశాన్ని కల్పించారు. ఈ మేరకు ఏపీ ఓపెన్ స్కూల్ రాష్ట్ర డైరెక్టర్ నాగేశ్వరరావు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వులు గురువారం డీఈఓ కార్యాలయానికి అందాయి. జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియెట్ స్టడీ సెంటర్లు నిర్వహించాలనుకునే వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు చేసుకునేవారు తప్పనిసరిగా ఉత్తర్వుల్లో పేర్కొన్న నియమ, నిబంధనలు పాటించాలని తెలిపారు. అందిన దరఖాస్తుల ఆధారంగా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు ఇస్తారన్నారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లైతే డీఈఓ కార్యాలయంలోని ఓపెన్ స్కూల్ విభాగంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ముగ్గురికి గాయాలు


గాయపడిన సౌందర్య, కన్నన్


తీవ్రంగా గాయపడిన రాజకుమారి

గుడిపాల: కారును ఈచర్ వాహనం ఢీకొనడంతో ముగ్గురు గాయపడినట్లు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. తమిళనాడు రాష్ట్రం కాంచీపురం నుంచి చిత్తూరుకు వస్తున్న టీఎన్06ఎమ్2832 నంబరు మారుతి వ్యాగనర్ కారును, చిత్తూరు నుంచి తుపత్తూరుకు వెళ్తున్న టీఎస్42ఎటి1006 నంబరు ఈచర్ వాహనం ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న చిత్తూరుకు చెందిన సౌందర్య(37), కన్నన్(44), రాజకుమారి(65) గాయపడ్డారు. ఇందులో రాజకుమారి తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రులను వెంటనే 108 అంబులెన్స్ ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డిజిటల్ భారత్



స్మార్ట్‌ఫోన్ ఉండి..బ్యాంకు ఖాతాలో నగదు ఉంటే చాలు.. జేబులో రూపాయి లేకపోయినా దేశామంతా తిరిగి రావచ్చు. పెద్దనోట్ల రద్దు తరువాత ఏటీఎం కార్డుల ద్వారా నగదు చెల్లింపులు ప్రారంభమయ్యాయి. ఆ తరువాత డిజిటల్ పేమెంట్స్ అందుబాటులోకి రావడంతో జనం వాటికే ప్రాధాన్యత ఇస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహిస్తుండదంతో అవినీతి, అక్రమాలు గణనీయంగా తగ్గిపోయాయి. వినియోగదారులు సైతం డిజిటల్ లావాదేవీలకు పూర్తిగా అలవాటు పడిపోయారు.

- పెద్దనోట్ల రద్దు తరువాత పెరిగిన నగదు రహిత లావాదేవీలు
- చిల్లర కొట్టు దగ్గర నుంచి షాపింగ్ మాల్స్, కార్పొరేట్ హాస్పిటల్స్ వరకు అంతటా డిజిటల్ చెల్లింపులే..
- అందుబాటులో ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి ఎన్నో రకాల యాప్స్
- క్యూఆర్ కోడ్ ద్వారా కూడా నగదు చెల్లింపు
- డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహిస్తున్న ఆర్బీఐ



ఫోన్‌పే ద్వారా నగదు చెల్లిస్తున్న వినియోగదారుడు

కార్వేటినగరం: ఒకప్పుడు నగదు రహిత లావాదేవీలు అంటే ఏమిటో 95 శాతం మంది ప్రజలకు తెలియదు. నగదు అవసరాలు ఎక్కువగా ఉండడంతో ఆర్‌బీఐ నుంచి కరెన్సీ చెస్టలకు డబ్బు ఎక్కువగా వచ్చేది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2016 నవంబరు 8వ తేదీ అప్పటి వరకు చెలామణిలో ఉన్న రూ.1000, 500 నోట్లు రద్దు చేశారు. దీంతో నగదు కొరత ఏర్పడడంతో డిజిటల్ లావాదేవీలకు ప్రాధాన్యత పెరిగింది. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటివి అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రతి చోటా వీటి ద్వారానే నగదు చెల్లింపులు చేస్తున్నారు. పీఓఎస్ మిషన్‌లలో కార్డులను స్వైపింగ్ చేయడం ద్వారా మొదలైన నగదు రహిత లావాదేవీలు తర్వాత రూపు మార్చుకున్నాయి. స్వైపింగ్ 90 శాతం వరకు తగ్గింది. నేడు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఒక్క నిమిషంలోని చెల్లింపులు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న అన్ని బ్యాంకుల్లో డిజిటల్ లావాదేవీలను మరింత ప్రోత్సాహిస్తున్నాయి.

పారదర్శకంగా పేమెంట్స్..

డిజిటల్ లావాదేవీలు పారదర్శకంగా ఉండడంతో వీటిపై ఆసక్తి పెరుగుతోంది. నేడు వీధి వ్యాపారులు, టీకొట్లు నిర్వహించేవారు. కూరగాయలు, పండ్ల వ్యాపారులు, చిన్న, చిన్న రిటైల్ వ్యాపారులు మొదలుకొని హోల్‌సేల్, వ్యాపారులు కూడా డిజిటల్ లావాదేవీల కోసం క్యూఆర్ కోడ్ వినియోగిస్తున్నారు. క్యూఆర్ కోడ్ లేని వ్యాపారం లేదంటే అతిశయోక్తి కాదు. ఫోన్, విద్యుత్ బిల్లులు వంటి వాటికి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌నే వినియోగిస్తున్నారు. స్వైపింగ్ పడిపోగా క్యూఆర్ కోడ్‌కు ప్రాధాన్యత గణనీయంగా పెరిగింది. డిజిటల్ లావాదేవీలు పెరిగిపోవడంతో ఆర్‌బీఐ కరెన్సీనోట్ల ముద్రణను గణనీయంగా తగ్గించింది. ఈ ఏడాది మార్చి నెల వరకు పింఛన్ సొమ్మును నగదు రూపంలో పంపిణీ చేసేవారు. వీటి కోసం ఆర్‌బీఐ నుంచి అనుమతులు తీసుకుని బ్యాంకులకు నగదు చేరేది. ఈ ఏడాది మే, జూన్ నెలల్లో పింఛన్ సొమ్ము కూడా బ్యాంకు ఖాతాలకు విడుదలైంది. దీంతో డిజిటల్ లావాదేవీలు మరింత పెరిగాయి.

సౌండ్ బాక్సులతో మోసాలకు అడ్డుకట్ట..

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసాలకు అంతే ఆస్కారం ఉంటుంది. వీటిని అడ్డుకట్ట వేయడానికి క్యూఆర్ కోడ్ బోర్డులకు స్పీకర్ బాక్స్‌లను అనుసంధానం చేస్తున్నారు. దీంతో ఆన్‌లైన్ చెల్లింపు జరగ్గాగానే ఎంత మొత్తం దుకాణదారులకు జమ అయిందో వాయిస్ రూపంలో వినపడుతుంది. తద్వారా అవగాహన లేని, చదువు రానివారికి సులభంగా అర్థమవుతుంది.


ఎంత నగదు జమ అయిందో చెప్పే సౌండ్ బాక్సులు

సమయం ఆదా అవుతుంది



డిజిటల్ పేమెంట్లతో బ్యాంకులకు వెళ్లకుండా సమయం ఆదా అవుతోంది. చేతిలో డబ్బులు లేకున్నా బ్యాంకు ఖాతాలో డబ్బుంటే వస్తువులు కొనుగోలు చేయవచ్చు. ఒక్క రూపాయి నుంచి ఎంతవరకైనా ఫోన్‌పే, గూగుల్ పే, తదితర యాప్స్ ద్వారా సులువుగా చెల్లించవచ్చు. ఆన్‌లైన్ పేమెంట్లు వచ్చిన తర్వాత సులువుగా మార్కెట్‌లో క్రయవిక్రయాలు కూడా బాగా పెరిగాయి. నెల వారీగా ఎంత ఖర్చు పెట్టామో తిరిగి చూసుకునే అవకాశం కూడా ఉంది.

– మమత, గృహిణి, కార్వేటినగరం

ఎంతో మేలు..



ఎంతోకాలంగా నేను హోటల్ వ్యాపారం చేస్తున్నాను. గతంలో హోటల్‌కి వచ్చిన వారు తన వద్ద చిల్లర లేదని చెబుతుండడంతో తామే వెళ్లి తెచ్చి ఇవ్వాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం డిజిటల్ పేమెంట్‌తో చిల్లర సమస్య లేదు. అంతేకాకుండా లావాదేవీలు ఎంతో సులువుగా మారింది. చిల్లర ఇచ్చే సమయంలో తేడా వస్తే నష్టపోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. – గురుమూర్తి, హోటల్ యజమాని, కార్వేటినగరం

ఆర్బీఐ ప్రోత్సాహం బాగుంది..



డిజిటల్ లావాదేవీలను ఆర్బీఐ ప్రోత్సహించడం బాగుంది. చిన్న, పెద్ద వ్యాపారస్తులకు ఇబ్బందులు లేకుండా లావాదేవీలు జరుపుకునేందుకు ఫోన్‌పే, గూగుల్‌పేలు ఎంతో దోహదపడుతోంది. మొదట్లో డెబిట్, క్రెడిట్ కార్డులను పీఓఎస్ మిషన్‌లలో స్వైపింగ్ చేసుకోలేక ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు క్యూఆర్ కోడ్ స్కాన్‌తో నగదు జమ సులభతరంగా మారింది. వ్యాపారాలకు ఈ పద్ధతి అవసరం.

– బియారాం కుమౌత్, ఎలక్ట్రికల్ షాపు యజమాని, కార్వేటినగరం

పూర్వ జెడ్పీ సీఈఓ సస్పెన్షన్

చిత్తూరు కార్పొరేషన్: ఆర్థిక అవకతవకలు, పరిపాలనలో తప్పిదాలకు పాల్పడ్డారని పూర్వ జెడ్పీ సీఈఓ, బైరెడ్డిపల్లె ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ పంచాయతీ రాజ్ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభాకర్‌రెడ్డి జెడ్పీ సీఈఓగా ఉన్నప్పుడు అవకతవలకు పాల్పడ్డట్లు టీడీపీ నాయకులు, విశ్రాంత అధికారులు ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్వ జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. కలెక్టర్ నివేదిక మేరకు ప్రభాకర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కాగా మరో 2 రోజుల్లో ప్రభాకర్‌రెడ్డి ఉద్యోగ విరమణ చేయనుండగా టీడీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదులు చేసి సస్పెండ్ చేయించినట్లు ప్రచారంలోకి వచ్చింది.

రెచ్చిపోయిన చైన్‌స్నాచర్

నాగలాపురం: చైన్ స్నాచర్ రెచ్చిపోయాడు. పట్టపగలు ఓ మహిళ మెడలో నుంచి చాకచక్యంగా బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన మండలంలో చర్చనీయాంశమైంది. ఎస్ఐ ఓబయ్య కథనం.. మండలంలోని వినోబానగర్ గ్రామనికి చెందిన మునెమ్మ(55) ఊత్తుకోటైలోని సాయిబాబ గుడికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో ఆమె స్వగ్రామానికి ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు తన వినోబానగర్ బస్ స్టాపింగ్ వద్ద బస్సు దిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తోంది. విషయం తెలుసుకున్న చైన్ స్నాచర్ బైక్‌లో ఆమెను వెంబడించాడు. ఆపై ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు నాగలాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

తిరుపతి క్రైమ్: నగరంలో పేకాటాడుతున్న ఆరుగురిని అలిపిరి పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ రామారావ్ వివరాల మేరకు.. రామచంద్ర మిషన్ ఎదురు వీధిలో ఉన్న పార్కు వద్ద నిర్మానుష్య ప్రాంతంలో పేకాటాడుతున్నట్లు సమాచారం వచ్చింది. పోలీసులు తమ సిబ్బంది దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా నగర వాసులే. వీరు చిరు వ్యాపారులు, డ్రైవర్లుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరి వద్ద నుంచి రూ.33,400 నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కి తరలించినట్టు సీఐ తెలిపారు.

జాతీయ విలువిద్య పోటీలకు విశ్వం విద్యార్థి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థి టి.హేమన్ష్ క్రితిక్ జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 24న విజయవాడలో 6వ ఓపెన్ అండర్-10 రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీల్లో రికర్వ్ విభాగంలో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఆ విద్యార్థిని గురువారం ఆ పాఠశాల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి అభినందించారు.


హేమన్ష్ క్రితిక్‌ను అభినందిస్తున్న విశ్వనాథ్‌రెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

ఖర్చుల వివరాలను అందజేయండి


సమావేశంలో పాల్గొన్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల వ్యయ ఖర్చుల వివరాలను బరిలో నిలిచిన ఆయా పార్టీల అభ్యర్థులు కచ్చితంగా అందజేయాలని జిల్లా ఆడిట్ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో అభ్యర్థుల వ్యయఖర్చుల అంశంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 28, 29 తేదీల్లో ఎన్నికల తుది వ్యయ ఖర్చుల నివేదికను అందజేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తేదీ నుంచి ఖర్చుల వివరాలు తెలియజేయాలని తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారి అనుమతితో అన్ని నియోజకవర్గాలకు సమాచారం ఇచ్చామన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో జిల్లాకు ఎన్నికల అబ్జర్వర్లు విచ్చేస్తారని తెలిపారు. ఆలోపు ఆయా అభ్యర్థులు సంతకంతో వివరాలను తప్పనిసరిగా అందజేయాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించి నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటిన అధికారులు


పోగొట్టుకున్న నగదును భక్తురాలికి అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్ మధు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి దర్శనార్థం వచ్చిన భక్తులు క్యూలో పోగొట్టుకున్న నగదును తిరిగి భక్తులకు అందించి నిజాయితీని చాటుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. కర్ణాటక రాష్ట్రం, ముళబాగిల్‌కు చెందిన జమున తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం అమ్మవారి దర్శనానికి వచ్చారు. దర్శనానంతరం ఆలయ ప్రసాద కౌంటర్ క్యూలో జమున తన పర్సును పోగొట్టుకుంది. పర్సును గుర్తించిన విజిలెన్స్ అధికారులు ఆలయ సూపరింటెండెంట్ మధు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆలయంలోని మైకు ద్వారా ప్రచారం చేయడంతో భక్తురాలు కార్యాలయానికి చేరుకుని పర్సు వివరాలను తెలియజేశారు. దీంతో పర్సుతో పాటు అందులోని రూ.28 వేల నగదు, బ్యాంకు క్రెడిట్, డెబిట్ కార్డులతో పాటు ఇతర పత్రాలను ఆమెకు అందజేశారు. ఆలయ సిబ్బంది, అధికారుల నిజాయితీకి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సేవాభావానికి ప్రతిరూపం స్కౌట్స్ అండ్ గైడ్స్

శ్రీకాళహస్తి: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరి, సేవా భావం, దేశభక్తి కలిగి, సమాజ సేవ చేయాలని జిల్లా కార్యాలయ కమిషనర్ టీ.రమేష్ బాబు పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తిలోని ఆర్‌పీబీఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమ ప్రాధాన్యతను తెలిపే వాల్ పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నత పాఠశాల కమిషనర్, డీఈఓ వీ.శేఖర్ ఆదేశాల మేరకు ప్రతి స్కూల్‌లో స్కౌట్ అండ్ గైడ్, కళాశాలలో రోవర్, రేంజర్ యూనిట్లను ప్రారంభించాలన్నారు. విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం ఎంతగానో దోహదం పడుతుందని తెలిపారు. అందుకోసం పాఠశాలలోని టీచర్లు స్కౌట్ మాస్టర్లు గైడ్ కెప్టెన్లుగా శిక్షణ తీసుకోవాలన్నారు. హెచ్‌ఎం రాజేశ్వరి మాట్లాడుతూ స్కౌట్స్, గైడ్స్ శిక్షణ ద్వారా విద్యార్థులకు సేవాభావం, క్రమశిక్షణ పెంపొందుతుందన్నా రు. అనంతరం పెట్రోల్ లీడర్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. జిల్లా యూత్ చైర్మన్ ఎస్‌కే.అజారుద్దీన్, ధనుష్, గైడ్‌కెప్టెన్లు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయండి

- విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు
- సీఎం పర్యటనలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



మహిళా రైతులకు టార్పాలిన్, డ్రమ్స్ పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీలు

కుప్పం: విధుల్లో నిర్లక్ష్యం చూపకుండా కష్టపడి పని చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులకు సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి శ్రద్ధ చూపాలన్నారు. ప్రధానంగా సీఎం పర్యటనలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ప్రతి సచివాలయ పరిధిలో వీఆర్‌ఓ, విలేజ్ సర్వేయర్ బృందంగా ఏర్పడి ప్రతి గడపకు వెళ్లి రెవెన్యూ సంబంధించి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి నివేదికను తయారు చేసి ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు. భూములకు సంబంధించి పాస్‌బుక్ మ్యుటేషన్, భూమి సర్వే, భూఆక్రమణల అంశాలపై ఫిర్యాదులు స్వీకరించాలని సూచించారు. జూలై 15 లోపు అధికారులు తమ పరిధిలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని ఆయన కోరారు. విధి నిర్వహణలో ఏవైనా సమస్యలు, ఇబ్బందులు వస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. నిజాయితీగా పని చేస్తే ప్రజలతో సత్సంబంధాలు పెరిగి జిల్లా యంత్రాంగానికి మంచి పేరు వస్తుందని తెలిపారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు, నాలుగు మండలాల తహసీల్దార్లు, సంబంధిత రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో ఏపీ ఆదర్శనీయం..

ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రాష్ట్రాలకు ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా షెడ్యూల్ కుల సేవా సంఘం ఆధ్వర్యంలో పీఎం ఏజేఏవై పథకం ద్వారా రైతులకు టార్పాలిన్, డ్రమ్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పంలో చాలా గ్రామాల్లో యంత్రాలు, రసాయనాలు లేని ప్రకృతి వ్యవసాయం చేస్తుండడం హర్షణీయమన్నారు. ప్రకృతి వ్యవసాయంలో వచ్చే పంటలు తినడం వల్ల ప్రజలకు మెరుగైన ఆరోగ్యం, జీవన విధానం ఉంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పంలో పేదరిక నిర్మూలనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యం అన్నారు. 30 ఏళ్లు జరిగిన అభివృద్ధికి మించి ఈ ఐదేళ్లలో కుప్పం అభివృద్ధి చేయాలని ధ్యేయంతో ముందుకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో కుప్పంలో ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం వాసు, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ రాజలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.